ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్‌జీవోల సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ గురువారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు మాధవగౌడ్, నర్సింహ్మా, రమేష్, వెంకటేష్, గోపాల్ నాయక్ ఉన్నారు.

నియామకం

శాలివాహన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా శివకుమార్



మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన శివకుమార్ శాలివాహన(కుమ్మరి) సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర సంఘం సభ్యులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, సభ్యులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వం ఫలాలు అందేలా చూస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పజెప్పిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చని పరద పరిచినట్లు..



పొద్దు తిరుగుడు పంటను చూస్తే ముచ్చటేస్తుంది. పొద్దు ఎటుతిరిగితే అటు తిరిగే ఈ పువ్వుల పంట చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. దూరంగా చూస్తే భూమికి పసుపు పచ్చ రంగేసినట్టు కనిపిస్తుంది. శంకర్‌పల్లి మండలం పొద్దుటూర్ గ్రామంలో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంటను చూసి ఆ దారిన వెళ్లే ప్రయాణికులు పరవశించిపోతున్నారు. కొందరు వాహనదారులు పొలంలోకి వెళ్లి ఫొటోలు దిగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

జీవ వైవిధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మంత్రి కొండా సురేఖ

కన్హా శాంతివనంలో జాతీయ బయో డైవర్సిటీ సదస్సు



మంత్రి సురేఖకు జ్ఞాపికను అందజేస్తున్న రాష్ట్ర ఉన్నతాధికారులు

కొత్తూర్, ఫిబ్రవరి 20:(ఆంధ్రజ్యోతి) జీవ వైవిధ్య సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. నందిగామ మండలం కన్హా శాంతివనంలో గురువారం తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ బయోడైవర్సిటీ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే సదస్సును మొదటి రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దెబ్బతింటున్న జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతీఒక్కరు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా జీవవైవిధ్య సదస్సు ఎంతోగానే ఉపయోగపడుతుందన్నారు. యువ సైంటిస్టులు, విద్యార్థులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నో విధాలుగా సహజసిద్ధమైన ప్రాంతాలకు నెలవన్నారు. అడవులు, పచ్చిక బయళ్లు, తడి నేలలు, వృక్షాలు, జంతువులు ఇక్కడ అధికంగా ఉన్నాయన్నారు. పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం అందరి బాధ్యతన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయని, వాటి సంరక్షణ బాధ్యత మానవజాతిపై ఉందన్నారు. జీవ వైవిధ్యం విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉందన్నారు. దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు జీవ వైవిధ్యం సంరక్షణలో నిమగ్నమై ఉన్నాయని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సదస్సులో దేశంలోని పలు రాష్ట్రాలలోని ఆయా యూనివర్సిటీలకు చెందిన 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. 22న నిర్వహించే ముగింపు సదస్సుకు రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్‌వర్మ హాజరుకానున్నారు. కార్యక్రమంలో తెలంగాణ బయోడైవర్సిటీ చైర్మన్ అచలేందర్‌రెడ్డి, కార్యదర్శి కాలిచరణ్ కార్‌తాడే, సైంటిఫిక్ అధికారి శిల్పిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల పరేషాన్!

పాల బిల్లులు అందక అవస్థలు



- అప్పుల ఊబిలో 'మదర్ డెయిరీ'
- డిసెంబర్ నుంచి నిలిచిన బిల్లు చెల్లింపులు
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- పరిగి సొసైటీకే రూ.80లక్షల బకాయి
- అయోమయంలో పాడిరైతులు

'మదర్ డెయిరీ'కి పాలు పోసే రైతులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రూ.కోట్లలో పాల బకాయిలు పేరుకుపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కుటుంబ పోషణకు ఆస్తులు కుదవపెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు నాలుగు నెలలైనా అందకపోవడంతో రోడ్డెక్కి ఆందళన చేస్తున్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాలను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు.



కుర్మిద్ద మదర్ డెయిరీ కేంద్రం వద్ద పాలు పారబోస్తున్న రైతులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ మహానగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏడాదంతా పాలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. నగరం, చుట్టుపక్కల గ్రామాల్లో డెయిరీ పెట్టుకుని రూ. లక్షలు గడిస్తున్న వారు కోకొల్లలు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్ డెయిరీని నమ్ముకున్న రైతులు మాత్రం ఉసూరుమంటున్నారు. కొన్ని నెలలుగా వారికి మదర్ డెయిరీ నుంచి చెల్లింపులు లేవు. దీంతో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అనేక మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డిజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాలుగా పాడి రైతులకు భరోసాగా ఉండేది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు దాణా, మందులు సబ్సిడీపై ఇస్తూ లబ్ధిచేకూర్చేది. అయితే తరువాత సొసైటీలో రాజకీయాలు చోటు చేసుకోవడంతో

మిగతా 7వ పేజీలో...

బోనస్ ఊసే లేదు

గతంలో పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇచ్చారు. అయితే కొంత కాలంగా బోనస్ నిలిపివేశారు. దీనికి తోడు పాల రేటు కూడా గణనీయంగా తగ్గించేశారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో పాల ధరలు తగ్గిన దాఖలాలు లేవు. పాల ధర తగ్గించి అమ్మినా మదర్‌డెయిరీకి పాలు విక్రయించే రైతులకు ఎలాంటి మేలు జరగడంలేదు. పైగా తాము అమ్మిన పాలకు డబ్బులు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు విక్రయించిన రైతులకు నెలకు రెండు సార్లు అంటే ప్రతి నెల 5వ తేదీన తరువాత 20వ తేదీన చెల్లింపు చేసేవారు. కానీ నాలుగేళ్లుగా ఈ అనవాయితీ ప్రకారం చెల్లింపులు జరగడం లేదు. ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారింది. డిసెంబర్ నుంచి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇంతవరకు చెల్లించ లేదు



ఉపాధి పనులను వినియోగించుకోవాలి

» డీఆర్‌డీఏ శ్రీలత

కేశంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ శ్రీలత సూచించారు. గురువారం కేశంపేట మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల తీరును ఆమె పరిశీలించారు. సంతాపూర్, బొదునంపల్లి, నిర్దవెల్లి గ్రామాలలో నర్సరీలను సందర్శించారు. నిర్దవెల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న పశువులపాకను పరిశీలించారు. చౌలపల్లి గ్రామంలో ఫార్మేషన్ రోడ్డును పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. నర్సరీలలో వనమహోత్సవానికి ఉపయోగపడే మొక్కలను పెంచాలని సూచించారు. ఆమె వెంట ఏపీడీ చరణ్ గౌతం, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సంధ్య, కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్, టీఏ నీలకంఠ బాబు ఉన్నారు.

యాప్రాల్‌లో ప్రణాళిక

- చిలుకూరుకు వచ్చేముందు సమావేశం
- అర్చకుల వద్ద అనుసరించాల్సిన విధానాల గురించి చర్చ
- వీరరాఘవరెడ్డి నుంచి నిజాలు రాబట్టిన పోలీసులు
- మూడు రోజుల పాటు సాగిన విచారణ
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు


7

మృత్యుకుహరాలు!

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు, గేట్‌వాల్వ్‌లు

పలుచోట్ల మూతలు ధ్వంసం

బెంబేలెత్తుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు



ఎలిమినేడులో ధ్వంసమైన గేట్‌వాల్వ్ పైకప్పు

ఆదిభట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు, చెర్లపటేల్‌గూడ, కప్పాడు, తుర్కగూడ, తులెకలాన్, సాహెబ్‌గూడ గ్రామాలతోపాటు ఆదిభట్ల మున్సిపాలిటీలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మ్యాన్‌హోళ్లపై ఉన్న మూతలు ధ్వంసమై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు వేశారు. కానీ మ్యాన్‌హోళ్లు, గేట్‌వాల్వ్‌లకు మరమ్మతులు చేయడం మరిచారు. వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2024 జనవరిలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతుండటంతో గ్రామాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయి. వాటి పరిష్కారంలో శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగితే కాని అధికారులు స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు.

నెలలు గడుస్తున్నా అదే తీరు

మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో మ్యాన్‌హోల్స్, గేట్‌వాల్వ్‌లు అధ్వానంగా తయారయ్యాయి. బుట్టి నర్సింహ్మా, గడ్డం శేఖర్, పాండురంగారెడ్డి ఇంటి దగ్గర గేట్‌వాల్వ్‌పై ఉన్న కప్పు ధ్వంసమై ఇనుప చువ్వలు బయటకు దర్శనమిస్తున్నాయి. 10వ వార్డులో మ్యాన్‌హోల్ కుంగిపోయింది. చర్లపటేల్‌గూడలోని చౌరస్తా నుంచి కర్ణంగూడ వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోళ్లు నోరు తెరుచుకొని ఉండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కప్పాడు గ్రామంలో 10వ వార్డులో మ్యాన్‌హోల్ పూర్తిగా ధ్వంసమైంది. ఆదిభట్ల మున్సిపాలిటీలోని సాహెబ్‌గూడలో బీసీ కమ్యూనిటీ హాల్ దగ్గర మ్యాన్‌హోల్ పగిలిపోవడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ఎలిమినేడు గ్రామంలో చాలాచోట్ల మ్యాన్‌హోళ్లు, గేట్‌వాల్స్ పైకప్పులు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. సీసీ రోడ్డు వేశారు కానీ వీటికి మరమ్మతులు చేపట్టలేదు. గెట్‌వాల్స్ పైఉన్న కప్పులు విరిగిపోయి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే అధికారులు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలి.

- గడ్డం శేఖర్, ఎలిమినేడు

నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం

మ్యాన్‌హోల్స్, గేట్‌వాల్స్ పైకప్పులు ధ్వంసమైనది వాస్తవమే. నిధుల లేమితో మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరుగుతుంది. కొన్నిచోట్ల మరమ్మతులు చేశాం. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

- రవీందర్, ఎలిమినేడు పంచాయతీ కార్యదర్శి

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఆమనగల్లు , ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కమిటీ చైర్మన్ విస్లావత్ లింగ్యా నాయక్ తెలిపారు. ఆమనగల్లులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను గురువారం ఆయన సందర్శించారు. వసతి గృహ అధికారి గోపాల్, ఎస్‌వో పద్మజ్యోతిలతో సమావేశమై విద్యార్థుల సంఖ్య, వసతులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కృష్ణనాయక్, అలీం, భాస్కర్ నాయక్, శివనాయక్, శ్రీను, శ్రీధర్ నాయక్, రాజేందర్, హరి పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి 23న టీజీ సెట్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల ఇబ్రహీం పట్నంలో ఈ నెల 23న 5వ తరతగతి ప్రవేశం కోసం టీజీ సెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిరి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని ఆమె చెప్పారు. 650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. హాల్ టికెట్‌లో ఏమైనా తప్పులుంటే.. వారు చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.



బండను లాగుతున్న ఒంగోలు జాతి ఎద్దులు

అట్టహాసంగా.. బండలాగుడు పోటీలు

» ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల కేంద్రంలోని దవళగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం అంతరాష్ట్ర ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాపట్ల, అనంతపురం, నంద్యాల, పల్నాడు, తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన 11 జతల ఒంగోలు జాతీ ఎద్దులు బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. బండ లాగుడు పోటీలను తిలకించడానికి కల్వకుర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఆమనగల్, షాద్‌నగర్, మహేశ్వరం ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కాగా, కేశంపేట సీఐ నరహరి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు, దాతలు అన్నదానం, తాగు నీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మురళీమోహన్, ఉత్సవ కమిటీ ప్రధాన

మిగతా 8వ పేజీలో...

ప్రత్యేక ఆకర్షణగా పొట్టేలు

నాగర్ కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లెకు చెందిన డాక్టర్ అఖిలేష్ రెడ్డి ఎద్దుల జత బండలాగుడు పోటీలలో పాల్గొన్నాడానికి తీసుకవచ్చారు. వాటితో పాటు ఓ పొట్టేలును తీసుకొచ్చారు. కొమ్ములు తిరిగన ఆ పొట్టేలు బండలాగుడు పోటీలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు పొట్టేలుతో ఫొటోలు దిగారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించండి



ప్రభుత్వ స్థలం వివరాలను చూపుతున్న బక్కని నర్సింహులు, ఎస్.రాజు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ శివారులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 171 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉందన్నారు. అప్పట్లో ఇందులో కొంత విలేకరులకు ఇళ్ల స్థలాలకు, అలాగే గొర్రెల కాపరుల సంఘానికి కొంత కేటాయించారన్నారు. మిగతా భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఈ సర్వే నంబర్‌లో మొత్తం ఎంత భూమి ఉంది? ఎవరెవరికి కేటాయించారు? మిగతా భూమి ఎవరు ఆక్రమించారో తేల్చేందుకు అధికారులు సర్వే చేయించాలన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఆ స్థలాన్ని ప్రభుత్వానికి స్వాధీనం చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకుడు రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చౌదరిగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):వ్యక్తిగత పరిశుభ్రతతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం కొందర్గు కేజీబీవీలో గురువారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగహన కల్పించారు. శరీరం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని పళ్లు తోమడం, నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ వి జయలక్ష్మి, డాక్టర్ రాగిని, సిబ్బంది అన్నపూర్ణ, లోకనాథ్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్



సైన్స్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబర్చిన కళాకారులతో విద్యార్థిని పూజాచారి

సైన్స్ ఆర్ట్స్‌లో పూజాచారి ప్రతిభ

● గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం

చౌడాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జెన్‌టీయూ)లో గురువారం నిర్వహించిన ఆర్ట్స్ సొసైటీ 84వ ఆల్ ఇండియా వార్షిక ఎగ్జిబిషన్‌లో చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన స్కాలర్ వడ్ల పూజాచారి స్టోన్ కార్వింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఆమె గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, రూ.25వేల నగదు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పూజాచారి మాట్లాడుతూ.. కళలో తనను ప్రోత్సహించిన చిత్రలేఖనం ఉపాధ్యాయులు ప్రణీత, కృష్ణాచారిలకు ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీ రాజకీయాల్లో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం

● బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు కుంచం శ్రీనివాస్‌గుప్తా



చేవెళ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్టానం రేఖగుప్తాను నియమించడంతో దేశ రాజధాని రాజకీయాల్లో ఓ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైందని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు కుంచం శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖగుప్తాను నియమించడం సంతోషకరమన్నారు. రేఖాగుప్తా నాయకత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిబద్ధత, ప్రజలకు ఉన్నత సేవలు అందించే రేఖాగుప్తా ఢిల్లీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతారని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియమితులైన రేఖాగుప్తా కుటుంబీకులు వ్యవసాయ మార్కెట్‌లో చిన్న కమిషన్ వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు దక్కడం బీజేపీలోనే సాధ్యం అన్నారు. రేఖాగుప్తా కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యురాలిగా, ఏబీవీపీ మెంబర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు. సీఎం రేఖాగుప్తాకు ఆర్యవైశ్య సంఘం తరుపున, బీజేపీ తరుపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాగుణం అలవడుతుంది



మాట్లాడుతున్న అనురాగ్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో, యువతలో సేవా దృక్పథం అలవడుతుందని అనురాగ్ యూనివర్సిటీ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేశ్ అన్నారు. గురువారం యూనివర్సిటీ యూనిట్ 2, 3 సమ్మర్ క్యాంప్‌లను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పడమటి సోమారం, మక్త అనంతారం గ్రామాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రా మాల్లో సదుపాయాలు కల్పించేలా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీధుల్లో చెత్త తొలగించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం, కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కుపై వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ విజయకుమార్, లెక్చరర్లు పురుషోత్తం, శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రచారమే తప్ప ప్రగతి లేదు!



కానుగుబావి తండాలో పర్యటిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జె.దశరథ్‌నాయక్ అన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిలిచిన పనులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కడ్తాలలో, కానుగుబావి తండాలో గురువారం దశరథ్ పర్యటించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణలతో కలిసి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ గ్యారంటీలపై ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని సూచించారు. ప్రచారమే తప్ప 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రగతేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో లాయక్‌అలీ, మహేశ్, దాసు, శ్రీకాంత్, కిషన్, వెంకటేశ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి

ఎకో టూరిజం కార్యక్రమాలు



ఎకో టూరిజం కార్యక్రమంలో ఔత్సాహికులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మార్చి 30 వరకు ప్రతి వీకెండ్ శనివారం, ఆదివారం తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎకో టూరిజం కార్యక్రమాలను రూపొందించింది. అందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 9:30 గంటల వరకు ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 23న వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7 నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్, మార్చిన 1న ఫారెస్ట్ ట్రెక్కింగ్ పార్క్‌లో మధ్యాహ్నం 3 నుంచి మరుసటి రోజు ఉదయం 10 నుంచి నేచర్ క్యాంప్, 2న సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7 నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్, మార్చి 8న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 నుంచి మరుసటి రోజు ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, మార్చి 9న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఉదయం 6:30 నుంచి 9:30 గంటల వరకు బర్డ్ వాక్, మార్చి 15న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, 16న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఉదయం 6:30 నుంచి 9:30 గంటల వరకు ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్, 22న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ వాక్, 23న వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు బర్డ్‌వాక్, ట్రెక్కింగ్, 29న మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, 30న గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అడవులపట్ల, జంతువులపట్ల, పక్షులపట్ల ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా స్థిరమైన పర్యాటక అభివృద్ధికి అడుగులు వేసేలా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డెక్కన్‌వుడ్స్ ట్రయిల్స్ పేరుతో ప్రతీ శని, ఆదివారాలు అనేక కార్యక్రమాలు రూపొందించినట్లు ఎకో టూరిజం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ వివరించారు. వీటిల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు 9493549399, 9346364583 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



- మరాఠా, కన్నడ రాష్ట్రాల మీదుగా పరుగులు తీస్తున్న కృష్ణానది
- భీమా నికర జలాలతో కొడంగల్, నారాయణపేట ప్రాంతాలు సస్యశ్యామలం
- నేడు లిఫ్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

రైతుల చిరకాల స్వప్నం.. ఎత్తిపోతల పథకం సాకారం


కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలు

కొడంగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):వెనకబడిన కొడంగల్ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం త్వరలోనే సాకారం కానుంది. కొడంగల్, నారాయణపేట, మక్తల్ ప్రాంతాల రైతులకు చెరువుల ద్వారా సాగు నీరందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పథకానికి శ్రీకారం చుట్టారు. గవర్నర్ పాలనలో 2014లో జీవో 69 అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పథకం అమలుకు చర్యలు చేపట్టారు. కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ రూపకల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నిధుల మంజూరు చేయడంతో పనులను ప్రారంభించారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకుపైగా సాగునీరు, 5.5లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. మెట్ట ప్రాంత భూములకు నీరందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంపై పలుమార్లు అధికారులతో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహించి పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దీన్ని పూర్తిచేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెల్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఎత్తిపోతల పథకం అమలుకు మార్గం సుగమమై నిధులు రానున్నాయి.

పొరుగు రాష్ట్రాల నుంచి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

మరాఠా, కన్నడ రాష్ట్రాల నుంచి పరుగులు తీసే కృష్ణా నది నారాయణపేట జిల్లా కృష్ణా నది మండలం తంగేడి వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. కృష్ణమ్మ పరుగుపెట్టేది ఉమ్మడి పాలమూరులోనే అయినా ఇక్కడ ఏ ప్రాంతానికి కృష్ణా జలాలు అందడం లేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో ఆయా ప్రాంతాలకు సాగునీరందిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు కాలేదు. భీమా ప్రాజెక్టు 20టీఎంసీల నికర జలాల కేటాయింపులో రెండు దశల ఎత్తిపోతల ద్వారా 12.9టీఎంసీలు సరిపోతుందని అధ్యయనాలతో తేల్చారు. మిగతా 7.1టీఎంసీల జలాలను కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతలకు కేటాయించారు. ఈ స్కీంను పూర్తిచేస్తే దుర్భిక్ష ప్రాంతాలకు నీరందుతుంది. భీమా ఫేజ్1 లిఫ్ట్ కింద నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోసి ఈ పథకాన్ని చేపట్టాలని ప్రతిపాదించారు. ఊట్కూర్, జాజపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర ఎత్తిపోతలకు నిర్ణయించారు. కొడంగల్ నియోజకవర్గంలోని జయమ్మ చెరువు మీదుగా కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్ చెరువులను కలుపుకొని నిర్దిష్ట ఆయకట్టుకు నీరందించేందుకు ఈ స్కీంను డిజైన్ చేశారు.


నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధుసూదన్‌రెడ్డి

సంక్షేమ పథకాలతోనే కాంగ్రెస్‌లో చేరికలు

షాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి తాళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సమ్మి పెంటయ్య, సీనియర్ నాయకులు రాజు, నర్సింలు, మరింత మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడిమాల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బార్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, నాయకులు దండు రాహుల్, సుభాష్‌రెడ్డి, శేఖర్, గౌరీశ్వర్, వెంకటయ్య, మాధవరెడ్డి, అంజిరెడ్డి, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఏడాది పాలనలో అద్భుత విజయాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చిన ఏడాదిలో హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధిల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం కోసం కృషిచేస్తుంటే ఓర్వలేని విపక్షాలు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు కయుక్తులు పన్నుతున్నాయని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు రూ.1.55లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలందజేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం, తండాకు బీటీ రోడ్లు వేస్తామని చెప్పారు. నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామని, రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. ఎండకాలంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. విపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలని నారాయణరెడ్డి కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, హన్మానాయక్, చేగూరి వెంకటేష్, శ్రీనివాస్, నరేశ్, అంజయ్య, శ్రీశైలం, అజీం, కాసు శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యా, జగన్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్ రెడ్డి, వస్పుల మానయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్లతో ఎరువుల పిచికారీ సులువు

యాచారం. ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో పంటలకు ఎరువులు పిచికారీ చేసుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్, భార్గవి అన్నారు. నానో ఎరువులు వాడితే నేల సారాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. గురువారం ధర్మన్నగూడలో పరిశోధన కేంద్రం, ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా డ్రోన్‌తో ఎరువుల స్ప్రేపై అవగాహన కల్పించారు. డ్రోన్లు తక్కువ ధరకే లభ్యమవుతాయన్నారు. మొక్కజొన్న, పత్తి, వరి, కూరగాయలపై డ్రోన్లతో ఎరువుల పిచికారి సులభం అన్నారు. నానో ఎరువులు వాడితే డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చంద్రకాంత్, చౌహాన్, సాయికుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.2కోట్లు అవసరం

మర్పల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెరువుల మరమ్మతులకు రూ.2కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కొంశెట్టి ప్రాజెక్టు, పంచలింగాల చెరువు, తిమ్మాపూర్ చెరువు, నర్సాపూర్ చెరువులను పరిశీలించారు. చెరువుల్లో నీటి మట్టం ఎంతవరకు ఉందని, తూములు, కాల్వల మరమ్మతులు, చెరువుల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ భాస్కర్‌గౌడ్, వాటర్‌మెన్ పాండు, రవీందర్ ఉన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు జాయింట్ సర్వే

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌సింగారంలో గురువారం ల్యాండ్ పూలింగ్‌పై అధికారులు సర్వే నిర్వహించారు. 150 మంది రైతుల నుంచి 151 ఏకరాలు సేకరించారు. జాయింట్ సర్వే అనంతరం టెండర్ల ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఉప్పల్ భగాయత్ తరహాలో ప్రతాప్‌సింగారంలో హెచ్ఎండీఏ వెంచర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, పరమేశ్, సత్యప్రసాద్, నవీన్, చంద్రశేఖర్, దేవానంద్ పాల్గొన్నారు.

పాడి రైతుల పరేషాన్!

(ఐదో పేజీ తరువాయి)

అవకతవకలు మొదలయ్యాయి. మదర్ డెయిరీ నిధులన్నీ కరిగిపోయాయి. చివరకు అప్పుల పాలై ఉన్న ఆస్తులను కూడా కుదవపెట్టారు. ఆస్తులు కుదవపెట్టి తీసుకున్న రుణాలకు వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. నెలకు దాదాపు 45లక్షల వడ్డీ కడుతున్నారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులు కూడా బ్యాంకులకే మళ్లిస్తున్నారు. దీంతో రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. పాడి రైతు ప్రయోజనాలను పట్టించుకునే నాథుడే లేడు. డిసెంబర్ నుంచి రైతులకు సకాలంలో బకాయిలు చెల్లించడం లేదు. బ్యాంకు రుణాలు సంగతి అటు ఉంచితే రైతులకే ఇప్పటి వరకు రూ.24 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో కనీస స్థాయిలో కూడా చెల్లింపులు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు మదర్‌డెయిరీ పాల ధరను అమాంతంగా తగ్గించింది. గేదె పాలకు లీటర్‌కు రూ.3, ఆవు పాలకు లీటర్‌కు రూపాయిన్నర తగ్గించింది. ఈ నిర్ణయం కూడా రైతులకు శరాఘాతమేనని చెప్పాలి. బహిరంగ మార్కెట్‌లో పాలకు ఎంతో డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే. కానీ మదర్ డెయిరీ తన తప్పిదాలతో చేసిన అప్పుల నుంచి బయటపడేందుకు పాల ధర తగ్గించి రైతులకు మరింత నష్టాన్ని కలిగిస్తోంది. కష్టాల్లో ఉన్న రైతులు మాత్రం పాల ధర తగ్గిస్తే తగ్గించారు కానీ మా బకాయిలైన విడుదల చేయాలని దీనంగా అడుగుతున్నారు. తాము పడుతున్న కష్టాలను ప్రభుత్వానికి తెలియచేసేందుకు రెండు రోజుల కిందట యాచారం మండలం కుర్మిద్ద గ్రామ రైతులు రోడ్డుమీద పాలు కుమ్మరించి తమ నిరసన తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిగి సొసైటీలోనే రూ. 80లక్షల బకాయిలు ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే అప్పుల ఊబి నుంచి గట్టెక్కేందుకు ఆస్తులను విక్రయించాలని నిర్ణయించిన మదర్ డెయిరీ పాలకవర్గం ఆ వైపు శరవేగంగా అడుగులు వేస్తోంది. అయితే ఈ నిర్ణయాన్ని కొందరు సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యవహారం తేలే వరకు రైతుల బకాయిలు మాత్రం చెల్లించే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే రైతులు బయట పడే అవకాశాలు ఉన్నాయి.

తగ్గిన పాల సేకరణ

మదర్ డెయిరీ కింద 432 సొసైటీలు ఉండేవి, అలాగే 32వేల మంది రైతులు సభ్యులుగా ఉండే వారు. 24 చిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. గతంలో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు లక్షన్నర లీటర్లు ప్రతీరోజు సేకరించే వారు. అయితే గడిచిన నాలుగేళ్లుగా పరిస్థితి తారుమారైంది. సకాలంలో పాల డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు క్రమేపీ ప్రైవేటు కంపెనీల వైపు వెళ్లిపోతున్నారు. దీంతో సొసైటీల సంఖ్య 300వరకే పరిమితమైంది. పాల సేకరణ కూడా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో రోజుకు 65వేల లీటర్ల మాత్రమే సేకరిస్తున్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతి రోజూ 50వేల లీటర్లకుపైగా పాలసేకరణ జరిగేది. ఇపుడు 10వేల లీటర్లలోపుగానే పాల సేకరణ జరుగుతోంది. ఇదే పరిస్థితి ఇంకా కొనసాగితే ఈ రైతులంతా ప్రైయివేటు డెయిరీలను ఆశ్రయించే అవకాశం ఉంది.

బోనస్ ఊసే లేదు

గతంలో పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇచ్చారు. అయితే కొంత కాలంగా బోనస్ నిలిపివేశారు. దీనికి తోడు పాల రేటు కూడా గణనీయంగా తగ్గించేశారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో పాలధరలు తగ్గిన దాఖలాలు లేవు. పాల ధర తగ్గించి అమ్మినా మదర్‌డెయిరీకి పాలు విక్రయించే రైతులకు ఎలాంటి మేలు జరగడంలేదు. పైగా తాము అమ్మిన పాలకు డబ్బులు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు విక్రయించిన రైతులకు నెలకు రెండు సార్లు అంటే ప్రతి నెల 5వ తేదీన తరువాత 20వ తేదీన చెల్లింపు చేసేవారు. కానీ నాలుగేళ్లుగా ఈ ఆనవాయితీ ప్రకారం చెల్లింపులు జరగడం లేదు. ఇపుడు పరిస్థితి మరింత దారుణంగా మారింది. డిసెంబర్ నుంచి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇంత వరకు చెల్లించ లేదు

బకాయిలు చెల్లించి ఆదుకోవాలి

మా గ్రామంలో రైతులంతా 25 ఏళ్ల నుంచి మదర్ డెయిరీకే పాలు అమ్ముతున్నాం. పాల ఉత్పత్తి పెరగడంతో మా గ్రామంలోనే సొసైటీ ఏర్పాటు చేసుకున్నాం. రైతులంతా నమ్మకంతో నన్ను కుర్మిద్ద సొసైటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మా సొసైటీ నుంచి ప్రతి రోజూ 1700 లీటర్ల పాలు సేకరించి మదర్ డెయిరీకి పంపుతున్నాం. బయట ప్రైవేటు కంపెనీలు పాలకు ఎక్కువ ధర ఇస్తామన్నా, ఇతర ప్రయోజనాలు చేకూరుస్తామన్నా రైతులు మదర్‌డెయిరీని వదలలేదు. అయితే గడిచిన నాలుగేళ్లుగా మదర్ డెయిరీ సకాలంలో రైతులకు చెల్లింపులు చేయడం లేదు. గతంలో లీటర్‌కు నాలుగు రూపాయలు బోనస్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ డబ్బులు రావడం లేదు. డిసెంబర్ నుంచి పాల బకాయిలు చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. మా సొసైటీకి దాదాపు రూ. 40లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. రైతులు ఇబ్బందులు పడుతుంటే సొసైటీలో ఉన్న అత్యవసర నిధులను మళ్లించి రైతులకు కొంత సర్దుబాటు చేశాం. అసలే మేము ఇబ్బందుల్లో ఉంటే మదర్ డెయిరీ పాల ధరను తగ్గించి మరింత నష్టం కలిగిస్తోంది. మదర్ డెయిరీకి పాలు సరఫరా చేసి ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణమే బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

మహేందర్‌రెడ్డి, కుర్మిద్ద సొసైటీ చైర్మన్

మాజీ ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌లన్నీ ఉట్టివే!

- మనోహర్‌రెడ్డి వచ్చిన తర్వాతే రూ.800కోట్ల పనులు
- డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్



తాండూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి ఉన్న సమయంలో అభివృద్ధి పనుల పేరిట నిధులు లేకున్నా ఉత్తుత్తి ప్రొసీడింగ్‌లు ఇచ్చి బీఆర్ఎస్ నాయకులను తప్పుబట్టించారని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి గెల్చిన తర్వాతే అభివృద్ధి పనులకు నిజమైన ప్రొసీడింగ్‌లు, నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రూ.800కోట్లు మంజూరు చేయించిన ఘనత మనోహర్‌రెడ్డిదే అన్నారు. తాండూరు మండలంలో గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఇచ్చిన ప్రొసీడింగ్‌లు అన్నీ ఉత్తవేనని తేలడంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారన్నారు. బెల్కటూర్ శివారులో రూ.3కోట్ల పైచిలుకు నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకుడు వీరేందర్‌రెడ్డి పనికిరాని ఆరోపణలు చేయడం కరెక్టు కాదన్నారు. టీఆర్ఎస్ నాయకులు ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి పనులపై తెలుసుకుని మాట్లాడాలని రవీందర్‌గౌడ్ అన్నారు.




బ్రహ్మోత్సవాలకు మల్లప్పగుట్ట మల్లికార్జునాలయం ముస్తాబు

- రేపటి నుంచి ఏడు రోజులు ఉత్సవాలు
- 25న శివపార్వతుల కల్యాణం

తలకొండపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం, దర్శనీయ స్థలమైన చెన్నారం మల్లప్పగుట్టపై గల మల్లికార్జునస్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. మల్లికార్జునస్వామి ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ క్షేత్రంగా తీర్చిదిద్దారు. ఐదేళ్ల క్రితం గుట్టపై శిల్పకళ ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించి విగ్రహప్రతిష్ఠ చేశారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. సమీప గ్రామాలు, మండలాలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. స్వామివారల కల్యాణం, అగ్నిగుండ మహోత్సవం, కడువ కార్యక్రమాలు ప్రముఖంగా నిర్వహిస్తారు. ఉత్సవాల వివరాల ను ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకం పాండయ్య, కార్యదర్శి కె.మల్లారెడ్డి, చైర్‌పర్సన్ ఏమిరెడ్డి కౌసల్య, కార్యనిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి వివరించారు. 22న సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠ, 23న పూజలు, అభిషేకాలు, 24న నవమి వార్షికోత్సవాలు, ఏకవాద రుద్రాభిషేకం, 25న గణపతి పూజ, అగ్నిగుండాలు, 26న ఉదయం భ్రమరాంబమల్లికార్జునుల కల్యాణం, 27న కడువ(బోనాలు), 28న చక్రతీర్థం, మహా మంగళహారతి కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆమనగల్లు నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వందన, పాండయ్య, స్వప్నభాస్కర్‌రెడ్డి, రమేశ్‌నాయక్‌లు కోరారు.

యాప్రాల్‌లో ప్రణాళిక

● అనంతరం చిలుకూరుకు వీరరాఘవరెడ్డి సైన్యం

- మూడు రోజులు కొనసాగిన పోలీసు విచారణ
- నిజాలు రాబట్టిన పోలీసులు
- నేడు జ్యుడీషియల్ రిమాండ్

మొయినాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసలో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని విచారణ కోసం మూడు రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారించారు. దాడికి సంబంధించిన విషయాలు పోలీసులకు వివరించాడు. రెండు రోజులుగా మొయినాబాద్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సమక్షంలో విచారణ చేశారు. గురువారం చివరిరోజు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వద్ద విచారణ జరిగింది. మూడు రోజులు పోలీసులు అడిగిన ప్రశ్నలకు వీరరాఘవరెడ్డిని బెరుకు లేకుండా సమాధానం చెప్పినట్లు తెలిసింది. హిందూధర్మ పరిరక్షణ, రామరాజ్యం స్థాపించాలన్నదే తన ఆశయంగా ఓ సంస్థను ఏర్పాటు చేసుకొని సైన్యాన్ని ఏర్పర్చుకొని దాడికి పాల్పడినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. తన కుటుంబ నేపథ్యం, దాడికి గల కారణాలు పోలీసులకు వివరించినట్లు తెలిసింది.

పక్కా ప్లాన్ ప్రకారమే ...

చిలుకూరుకు వచ్చే ముందు వీరరాఘవరెడ్డి తన రామరాజ్యం సభ్యులతో యాప్రాల్‌లోని ఓ ఇంట్లో సమావేశమయ్యాడు. రెండురోజులు అక్కడే ఉన్నారు. రామరాజ్యం లక్ష్యాల గురించి వారికి వివరించాడు. అర్చకుల వద్దకు వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానంపై బోధించాడు. ప్రణాళిక రూపొందించుకున్న తరువాతే చిలుకూరుకు వచ్చారు. గురువారం పోలీసులు వీరరాఘవరెడ్డిని యాప్రాల్ తీసుకెళ్లారు. సమావేశమైన ప్రదేశం, అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయం అని సభ్యులతో ప్రమాణం చేయించాడు. అనంతరం వీరరాఘవరెడ్డి ఉండే మణికొండలోని అతడి ఇంటిని పరిశీలించారు. అక్కడ కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది. పోలీసు కస్టడీలో తెలుసుకున్న అంశాల నివేదికను శుక్రవారం కోర్టుకు సమర్పిస్తారని తెలిసింది. అలాగే వీరరాఘవరెడ్డిని కోర్టులో హాజరుపర్చనున్నారు. అక్కడి నుంచి నిందితున్ని జైలుకు పంపుతారని సమాచారం.

కూతురిపై తండ్రి అసభ్యకర ప్రవర్తన

- బాలిక ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం ఏడేళ్ల కింద బాలాపూర్ మండలం కుర్మల్‌గూడకు వచ్చింది. కూలి పనులు చేసుకుంటున్నారు. వారికి ఒక అమ్మాయి, ఇద్దరు కుమారులు. అమ్మాయి హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. 2024 అక్టోబర్‌లో దసరా సెలవుల్లో ఇంటికొచ్చింది. ఆ సమయంలో బాలికకు టైఫాయిడ్ రావడంతో పాఠశాలకు వెళ్లడం ఆలస్యమైంది. ఒంటరిగా ఇంట్లో ఉండగా తండ్రి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి, నిద్రపోతున్నపుడు శరీరాన్ని తాకి కాళ్లుపట్టుకొని లాగాడు. బాలిక అరవగా నోరు నొక్కి, ఎవరికైనా చెబితే తనను, ఆమె తల్లినీ చంపేస్తానని బెదిరించాడు. ఇలా బాలికపై నాలుగుసార్లు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇంటికొచ్చిన ప్రతిసారీ ఇలానే ప్రవర్తించడంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. తల్లి ప్రశ్నించగా జరిగినదంతా చెప్పింది. తండ్రి బాధ భరించలేక సైదాబాద్‌కు వెళ్లిపోయారు. తండ్రి అక్కడికీ వెళ్లి ఇలానే ప్రవర్తించగా తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పెరుగుతున్న కుక్కకాటు కేసులు

- మేడ్చల్ ప్రభుత్వాస్పత్రికి భారీగా బాధితులు
- జనవరిలో 372 మందికి వ్యాక్సిన్



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ప్రభుత్వాస్పత్రిలో కుక్క కాటుతో చికిత్స పొందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రోజూ సగటున పదికి తగ్గకుండా కుక్కకాటు కేసులొస్తున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణకు పలు కార్యక్రమాలు చేపడుతున్నా కుక్కల సంచారం తగ్గడం లేదు. పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా కుక్కకాటుకు గురువుతున్నారు. కుక్కకాటుకు గతంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందుబాటులో లేక ప్రైవేట్‌హాస్పిటళ్లలో, నగరంలోని గాంధీ, నారాయణగూడ, కోరంటి గవర్నమెంట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందే వారు. అయితే పెరుగుతున్న కేసుల కారణంగా స్థానిక ప్రభుత్వాస్పత్రుల్లోనూ కుక్కకాటు వైద్యం అందిస్తున్నారు. 2025 జనవరిలో మేడ్చల్ కమ్యూనిటీ ఆస్పత్రిలో 372 మంది కుక్క కాటు చికిత్స పొందినట్లు అధికారులు తెలిపారు. రోజుకు కనీసం ఐదుగురికి యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో యాంటీ రేబిస్ ఇంజక్షన్లను ఉంచుతున్నామని చెప్పారు. అయితే పిచ్చి కుక్కలు కరిచిన వారికి, కుక్క కాటు గాయం తీవ్రంగా ఉన్న వారికి ఇచ్చే హిమినోగ్లోబిన్ ఇంజక్షన్ కోసం నగరంలోని గాంధీ, కోరంటి ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఈ ఇంజక్షన్ మేడ్చల్ ఆస్పత్రిలో నిల్వచేసే సౌకర్యం లేక అక్కడికి పంపుతున్నామని వైద్యులు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణేది?



వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. గతంలో ఆయా ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు ఎక్కువగా నమోదవగా అధికారులు కుక్కలను పట్టి వాటికి బర్త్ కంట్రోల్ వ్యాక్సిన్ వేశారు. అయినా కుక్కలు భారీ సంఖ్యలో తిరుగుతున్నాయి. పిల్లలను, వృద్ధులను, మహిళలను కరుస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టి దూర ప్రాంతాల్లో వదిలేయడమో, లేదా మరోసారి వాటికి బర్త్ కంట్రోల్ చికిత్సలో చేయాలని ప్రజలు కోరుతున్నారు. పిచ్చి కుక్కలను వెంటనే పట్టుకొని దూర ప్రాంతాలను తరలించాలంటున్నారు.



మాట్లాడుతున్న రాము నాయక్

బీఆర్ఎస్ మునిగిపోయే నావ

కడ్తాల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, తెలంగాణలో ఆ పార్టీకి భవిష్యత్ లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ రాము నాయక్ అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం అబద్ధాల ప్రచారాలు సాగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాము నాయక్ మాట్లాడుతూ కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలెవరు పార్టీని వీడలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న ఒకరిద్దరు యువకులకు మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ గులాబీ కండువాలు కప్పి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తమ పార్టీలో చేరారని పేర్కొనడం హస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ భవిష్యత్ లేదని గ్రహించిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు. నిరంజన్‌నాయక్, భాస్కర్, పాండు, హన్మ, సికిందర్, శ్రీను, ప్రేమ్ చందర్, దామ ఉన్నారు.

మాజీ కారోబార్ మృతి

● ఎమ్మెల్యే, నాయకుల నివాళి



కొత్తూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన మాజీ కారోబార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రవల్లి నవీన్‌చారి తండ్రి జంగాచారి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే శంకర్ కొత్తూర్‌కు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. జంగాచారి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పి. మధుసూదన్‌రెడ్డి, జె.వేణుగోపాల్‌గౌడ్, కౌన్సిలర్ హేమదేవేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు చెంది గోవర్ధన్‌గౌడ్, జెనిగె జగన్, తిరుపతిరెడ్డి, జె. రాంరెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, వీర్లగూడెం మహేష్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ ఎర్రవల్లి నాగరాజు చారి, తదితరులు నివాళులర్పించారు.

బడుల బలోపేతానికి చేయూత అభినందనీయం

షాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో లక్ష్మణ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆకృతి ప్రాజెక్టులో భాగంగా మినీ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. షాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు యునైటెడ్ వేఆఫ్ హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల సేవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. టీచర్లు, ప్రజాప్రతినిధులున్నారు.

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన

● పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు



మొయినాబాద్ రూరల్ : విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలో అనంతరెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో దేవాలయాలు ఉండడం ద్వారా ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రక్తమైసమ్మ, ఎల్లమ్మవిగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అనంతరెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఊరంతా అమ్మవారి పాటలతో మార్మోగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర్గు రవళి గోపికృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, వడ్ల రవీందర్ చారి, వడ్ల నర్సింహచారి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, సత్యలింగంగౌడ్ గ్రామస్థులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

తలకొండపల్లి : ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. దైవ కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు, మానవాళి సన్మార్గ పురోగమానికి దోహద పడుతాయని అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శివస్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని, పూజలను ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో భక్తులు, శివమాల దారులు పెద్దసంఖ్యలో నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు ఆ యన్ను సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అజీం, మిట్టపల్లి అంజయ్య, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, కిసాన్‌సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు ఆరిఫ్, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, నర్సింహ, బోల్ల యాదగిరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయించండి



ఎమ్మెల్యే రంగారెడ్డిని సత్కరిస్తున్న మేడిపల్లి గ్రామస్తులు

యాచారం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి నుంచి కడ్తాల్ మండలంలోని పల్లెచెల్కతండా వరకు ఉన్న బీటీ రోడ్డును బాగు చేయించాలని మేడిపల్లి గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. రోడ్డు పూర్తిగా పాడైందని, బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో గిరిజనులు, రైతులు నానా ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. రోడ్డు దెబ్బతినడంతో కనీసం ఆటోలు కూడా నడవలేని స్థితిలో ఉందని వాపోయారు. విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు కాలినడకన మేడిపల్లి పాఠశాలకు చేరుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. యాచారం మండల కేంద్రం నుంచి తాటిపర్తి వరకు, తాటిపర్తి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రీబీటీ చేయించాలని చెప్పారు. రోడ్డు మరమ్మతు విషయమై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులకు ఆదేశాలిస్తున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మండల బీజేపీ నాయకులు ముంత జంగయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, ముచ్చర్ల సంపత్‌కుమార్, గోవర్ధన్, డాక్టర్ పి.రవీందర్‌గుప్త తదితరులు ఉన్నారు.

కళాశాల నిర్మాణానికి భూరి విరాళం



ఎమ్మెల్యేకు రూ.25లక్షల చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర హేచరీస్ జీఎం ఆనంద్, డా.అల్వాల్‌రెడ్డి

కొత్తూర్, ఫిబ్రవరి 20:(ఆంధ్రజ్యోతి) దాతల సహకారంతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తమ వంతుగా వెంకటేశ్వర హేచరీస్ యాజమాన్యం భూరి విరాళాన్ని ప్రకటించి ఉదారత చాటుకుంది. వెంకటేశ్వర హేచరీస్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే శంకర్ హైదరాబాద్‌లోని పరిశ్రమ ప్రధాన కార్యాలయానికి గురువారం వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను హేచరీస్ జీఎం కేజీ ఆనంద్, డాక్టర్ అల్వాల్‌రెడ్డి, ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాస్‌రావులు సన్మానించి, కళాశాల నిర్మాణానికి రూ.25లక్షల విరాళం చెక్కు రూపంలో అందజేశారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్ హేచరీస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవని అన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్

సేవలతో సమాజంలో కీర్తి

కడ్తాల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని మైసిగండి మాజీ సర్పంచ్ రామావత్ తులసీరామ్ నాయక్ అన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం సమీపంలో కందుకూరు మండలం దన్నారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి తులసీరామ్ కార్యక్రమాన్ని ప్రారంబించారు. అమృనాయక్, బీమ్లానాయక్, రవి నాయక్, శ్రీను, శంకర్, సత్యం, బీచు, శ్రీశైలం, రజనికాంత్, అనిల్ రెడ్డి, నవకాంత్, బస్సీలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై కసరత్తు!

యాచారం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంబించారు. భూ సమస్యలు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను గ్రామాలవారిగా రైతులను రెవెన్యూ కార్యాలయాలకు పిలిపించి తగిన పత్రాలను తెప్పించుకొని భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. యాచారం మండలంలో తహసీల్దార్ పరిధిలో 253, ఆర్డీవో పరిధిలో 368, హయత్‌నగర్ తహసీల్దార్ పరిధిలో 10, ఆర్డీవో పరిధిలో 4, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ పరిధిలో 507, ఆర్డీవో పరిధిలో 286, మాడ్గుల తహసీల్దార్ పరిధిలో 270, ఆర్డీవో పరిధిలో 167, మంచాల తహసీల్దార్ పరిధిలో 376, ఆర్డీవో పరిధిలో 99, యాచారంలో తహసీల్దార్ పరిధిలో 440, ఆర్డీవో పరిధిలో 169 భూ సమస్యలున్నాయని అధికారులు వెల్లడించారు. రెండు వారాల్లో సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది రికార్డులు తయారుచేస్తున్నారు. భూమాత పోర్టల్ అందుబాటులోకి వచ్చేసరికి ఎలాంటి భూ సమస్యలు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ధరణిలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి కేంద్రీకరించగా.. కొత్తగా ఓటర్‌లిస్టులో పేర్లు నమోదు చేయడం, రేషన్‌కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తదితర పనుల్లో నిమగ్నమవడంతో ధరణి సమస్యలను పరిష్కరించడానికి సమయం సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు.

మంత్రి సురేఖకు ఘన స్వాగతం



కొత్తూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో గురు వారం నిర్వహించిన నేషనల్ యూత్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి విచ్చేసిన మం త్రి కొండా సురేఖకు కాంగ్రెస్ నా యకులు ఘన స్వాగతం పలికారు. కొత్తూర్ మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సురేఖకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

అట్టహాసంగా.. బండలాగుడు పోటీలు

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శి నక్క చంద్రశేఖర్, నక్క గోపాల్ యాదవ్, శేఖర్ పంతులు, అంజిరెడ్డి, పాండు గౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గణేష్, యాదయ్య చారి, రామకృష్ణ చారి, రమణ గౌడ్, దశరథ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణ అభినందనీయం : ఎమ్మెల్యే శంకర్

ఒంగోలు జాతీ పశుపోషణ అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దవళగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. మొదటి బహుమతి రంగారెడ్డి జిల్లా నాదర్ గుల్ చెందిన వైపీఆర్ బుల్స్ గెలుచుకున్నాయి. మొదటి బహుమతిని శతాబ్ది టౌన్‌షిప్ ఎండి కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.1,00,116 అందించారు. రెండవ బహుమతి నంద్యాల జిల్లా, సరివెళ్లే మండలం గంపరమనుద్దిన్నే గ్రామానికి చెందిన కుందరు రాంభూపాల్ రెడ్డి ఎద్దుల జత గెలుచుకుంది. రెండవ బహుమతి రూ. 75,116/- మఠం చంద్రశేఖర్, గంద్ర జగదీశ్వర్, రమేష్, మంచే కృష్ణయ్య, మాధవ రెడ్డి, రవికాంత్, కె. దేవందర్‌లు అందించారు. మూడవ బహుమతి పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం వెంకటేశ్వర్ల ఎద్దుల జత సాధించింది, మూడవ బహుమతిని ప్రముఖ కాంట్రాక్టర్ యెన్నం గోపాల్ రెడ్డి రూ. 51,116/- ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, జగదీశ్వర్, తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, ఇబ్రహీం, రాజేందర్ రెడ్డి, రావుల పెంటయ్య, రాములు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో నూతన 'అతిథి గృహాన్ని' నిర్మించాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో నూతన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మించేలా ప్రభుత్వం కృషి చేయాలని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన అధ్వానం... అతిథి గృహం అనే కథనం పట్ల బీజేపీ నాయకులు స్పందించారు. ఈ మేరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని బీజేపీ నాయకులు సందర్శించి ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో అక్కడి పరిస్థితిపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న చేవెళ్లలో అతిథి గృహం అధ్వానంగా ఉండడం దురదృష్టక రమన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన గెస్టహౌస్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గెస్టహౌస్ పరిస్థితిపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి తీసుకెళ్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నూతన గృహం నిర్మించేందుకు ని ధు లు మంజూరు చేయాలని కోరుతామన్నారు. అతిథి గృహం నిర్మించలేకపోతే ఆ స్థ లం లోనే చేవెళ్ల మున్సిపాలిటీ నూతన కార్యాలయం ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. బీజేపీ నాయకులు మశ్చేందర్ రెడ్డి, జయసింహరెడ్డి తదితరులు ఉన్నారు.

కేఎల్లార్ కృషితో రోడ్డు విస్తరణ పనులు

మహేశ్వరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా పూర్తి కాకుండా ఉన్న తుమ్మలూరు-మహేశ్వరం ప్రధాన రోడ్డు విస్తరణ పనులు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కృషితో ప్రారంభమయ్యాయని మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆమనగంటి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం తుమ్మలూరులో రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సబితాఇంద్రారెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉండి కూడా రోడ్డు పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కేఎల్లార్ మంత్రులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులు విడుదల చేయించి తుమ్మలూరు రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేశారన్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్/యాచారం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని ఎన్కేపల్లి, జీవన్‌గూడ గ్రామస్థులు సంయుక్తంగా ఎన్కేపల్లిలో ఏర్పాటు ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని బుధవారం రాత్రి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, భీమేందర్‌రెడ్డి, షాబాద్ దర్శన్, ముదిగొండ రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు. శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేవైఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కన్వీనర్ వి.రవీందర్‌రెడ్డి అన్నారు. యాచారం మండలం కుర్మిద్దలో బుధవారం రాత్రి శివాజీ జయంతి నిర్వహించారు. యువకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

యాదయ్య త్యాగం మరువలేనిది

మహేశ్వరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన సిరిపురం యాదయ్య త్యాగాలను ఎప్పుడూ మరిచిపోలేమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. యాదయ్య 15వ వర్ధంతి సందర్భంగా గురువారం మహేశ్వరం గేటు సమీపంలోని యాదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాద య్య త్యాగం వృథా కాలేదని.. ఆయన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరుడు కావడం మరిచిపోలేమన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, రాజునాయక్, కుమార్, సత్యనారాయణ, శివ, హరి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యువకులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం పాడవుతుందని, గంజాయి, డ్రగ్స్ చాలా ప్రమాదకరమని, వాటికి దూరంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఇన్‌స్పెక్టర్ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు చెప్పారు. గురువారం సాయంత్రం మీర్‌ఖాన్‌పేట గ్రామస్తులతో వారు మాట్లాడారు. మాదకద్రవ్యాలు క్రయ విక్రయాలు జరిపిన వారి వివరాలను తెలియజేస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకోరాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంక్ లావాదేవీల గురించి మాట్లాడితే స్పందించవద్దని చెప్పారు.

సబితారెడ్డి చొరవతో గ్రామాల అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న దేవీలాల్ నాయక్, బాబు

కందుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చొరవతో మారుమూల గ్రామాల అభివృద్ధి జరుగుతున్నట్లు ఏఎంసీ మాజీ డైరెక్టర్ కె.దేవీలాల్ నాయక్, గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ మస్కు బాబు అన్నారు. గురువారం గుమ్మడవెల్లి పీడబ్ల్యుడీ రోడ్డు నుంచి గుమ్మడవెల్లితండా వరకు రూ.80లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. సబితాఇంద్రారెడ్డి చొరవతో గుమకమడవెల్లి, గుమ్మడవెల్లి తండాలలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు చేపట్టామని, తిమ్మాపురం నుంచి గుమ్మడవెల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్ల 40లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భద్రయ్య, నాయకులు ఎ.మల్లేష్, రాజునాయక్, తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చేవెళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని దశలవారిగా అభివృద్ధి చేస్తామని కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ జూలూరి శశికళపాండుగౌడ్ తెలిపారు. గురువారం గ్రామంలో రూ.15లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులతో కలిసి శశికళపాండుగౌడ్ ప్రారంబించారు. ఎమ్మెల్యే యాదయ్య కృషితో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. మాజీ ఉప సర్పంచ్ శంకర్‌యాదవ్, కార్యదర్శి కరుణాకర్, సీనియర్ నాయకుడు వీరేశం, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగదీశ్ కథనం మేరకు.. మండల పరిధి ఎలిమినేడు గ్రామంలో ఎక్కె శ్రీనివాస్ పొలం వద్ద ఈ నెల 15న గుర్తుతెలియని ఓ వృద్ధుడు అనారోగ్యంతో నీరసించి కనిపించాడు. అతను వేరే బాష మాట్లాడుతున్నాడు. దాంతో శ్రీనివాస్ అతనికి జర్వం మాత్రలు ఇచ్చి భోజనం పెట్టడంతో అక్కడే పొలం వద్ద ఉన్న రూంలో తలదాచుకున్నాడు. మరుసటి రోజు అతను మరింత నీరసంగా కనబడడంతో 108 అంబులెన్స్‌లో నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూనే ఈనెల 17న మృతి చెందాడు. మృతుడి వయస్సు 65 సంవత్సరాలు ఉంటుంది. ఎత్తు 5.3 అడుగులు కాగా.. నెరిసిన గడ్డంతో ఉన్నాడు. ఈమేరకు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులెవరైనా ఉంటే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఫోన్‌నెం.8712662419, 8712662361లలో సంప్రదించాలని సీఐ తెలిపారు.

బైక్ ఢీకొనడంతో మరొకరు..



కడ్తాల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. కడ్తాల-ముచ్చర్ల గేటు మధ్య జాతీయ రహదారిపై ఓ గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో కందుకూరు నుంచి పల్సర్ బైక్‌పై నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన చీమర్ల జగన్ నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వేగంగా ఢీకొట్టాడు. దాంతో గుర్తుతెలియని వ్యక్తికి బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గాయపడ్డ జగన్‌ను స్థానికులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక ఫిల్టర్ల నిర్వహణ నలుగురి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



పోలీసుల అదుపులో యువకులు

కడ్తాల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వాగునుంచి అక్రమంగా మట్టిని తీసి కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయిస్తున్న కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి చెందిన నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముద్విన్ గ్రామానికి చెందిన బొల్లు మహేశ్, కట్ట శ్రీశైలం, గుడిగె శేఖర్, సుందూరి జంగయ్యలు వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తీసి ఫిల్టర్ల ద్వారా ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈనెల 14న పెద్దఎత్తున దాడులు నిర్వహించారు. జేసీబీ, విద్యుత్ మోటార్లు, పైపులు, ఇసుక డంపులను సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు గురువారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసి కృత్రిమంగా ఇసుక తయారుచేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు



కిరాణ షాపును తనిఖీ చేస్తున్న పోలీసులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలంలో అనుమతి లేకుండా మద్యం, గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలో పోలీసు బృందంతో తనిఖీలు నిర్వహించారు. పది కేసులు నమోదు చేశారు. ఆరు లిక్కర్, నాలుగు గుట్కా విక్రయదారులు, పది బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇసుక, మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తే ఎంతటి వారైన సరే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిరాణం షాపుల్లో గుట్కాలు విక్రయిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో కొందుర్గు ఎస్ఐలు రవీందర్ నాయక్, బాలస్వామి, ఏఎస్ఐ ఛత్రీయ నాయక్, హెచ్‌సీ శ్రీనివాస్‌లతోపాటు పోలీస్ బృందం పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత



నగదు, పట్టు చీర అందిస్తున్న దశరథ్

కడ్తాల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ పెళ్లికి నాయకులు రూ. 1.90 లక్షలు సాయమందించి ఉదారం చాటుకున్నారు. కడ్తాల మండలం కానుగుబావి తండాకు చెందిన సేనావత్ రాజు కూతురు ఝాన్సీ వివాహం నేపథ్యంలో కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ రూ. 21 వేల నగదు, పట్టు చీర, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్ రూ. 25 వేలు, మాజీ ఉప సర్పంచ్ శారదపాండు నాయక్ రూ.50 వేలు, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మణ్ నాయక్ రూ.75 వేల నగదు, పట్టు చీర, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు మూడావత్ శ్రీను రూ.10వేలు, మాజీ వార్డు సభ్యుడు శంకర్‌నాయక్ రూ.5వేలు, బీమానాయక్ రూ.4వేలు సమకూర్చారు. గురువారం వివాహం సందర్భంగా పెళ్లి కూతురు ఝాన్సీకి దశరథ్ నాయక్ వాటిని అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కానుగుల అలివేలు నాగయ్య దంపతుల కూతురు విజయలక్ష్మి వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.21వేలు, పట్టు చీరను దశరథ్ నాయక్ అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, మహేశ్, శంకర్, కిషన్, రతన్, సిద్ధు, నరేశ్, తదితరులున్నారు.